త్యాగరాజన్ పాంచ్ పటాకా

● హైదరాబాద్ ఘన విజయం

అహ్మదాబాద్: విజయ్‌హజారే వన్డే టోర్నీలో హైదరాబాద్ ఖాతాలో నాలుగో విజయం చేరింది. ఆదివారం అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత తనయ్ త్యాగరాజన్(5/32) ధాటికి అరుణాచల్‌ప్రదేశ్ 28.3 ఓవర్లలో 96 పరుగులకు కుప్పకూలింది. సిద్దార్థ్(29), ధృవ్‌సోనీ(20) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. తనయ్ స్పిన్ ధాటికి అరుణాచల్‌ప్రదేశ్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన హైదరాబాద్ 12 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. నితేశ్‌రెడ్డి(29 నాటౌట్) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ఐదు వికెట్లు తీసిన తనయ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. మరోవైపు విజయ్ హజారే టోర్నీలో గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, విదర్భ, బరోడా నేరుగా క్వార్టర్స్ బెర్తు దక్కించుకున్నాయి.

మెయిన్‌డ్రాకు నాగల్

అక్లాండ్: ఏఎస్‌బీ క్లాసిక్ ఏటీపీ టోర్నీలో భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నాగల్ మెయిన్‌డ్రాకు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన అర్హత రౌండ్ పోరులో నాగల్ 7-6(5), 6-3తో అడ్రియన్ మనారినో(ఫ్రాన్స్)పై అద్భుత విజయం సాధించాడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 98వ ర్యాంక్‌లో ఉన్న నాగల్ తన కంటే మెరుగైన ర్యాంక్ (66)లో ఉన్న అడ్రియన్‌ను మట్టికరిపించాడు. ఇటీవల పలు జరిగిన పలు టోర్నీల్లో మొదటి రౌండ్లలోనే నిష్క్రమించిన నాగల్.. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముందు మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.

స్మిత్ @ 9,999

ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ టెస్టుల్లో పదివేల మార్కుకు అడుగు దూరంలో నిలిచాడు. భారత్‌తో సిడ్నీ టెస్టులో పదివేల పరుగులు పూర్తి చేస్తాడనుకున్న స్మిత్..ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో ఔటై 9,999 పరుగుల వద్ద ఆగిపోయాడు. దీంతో జయవర్దనే(శ్రీలంక) తర్వాత ఇలా ఔటైన రెండో బ్యాటర్‌గా స్మిత్ నిలిచాడు. శ్రీలంకతో గాలె వేదికగా ఈనెలాఖరులో జరిగే మ్యాచ్ వరకు స్మిత్ వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆస్ట్రేలియా తరపున అలెన్‌బోర్డర్, స్టీవ్‌వా, రికీ పాంటింగ్ తర్వాత టెస్టుల్లో 10వేల మైలురాయిని చేరుకోనున్న నాలుగో బ్యాటర్‌గా స్మిత్ నిలిచే అవకాశముంది. స్మిత్ ప్రస్తుతం 114 మ్యాచ్‌ల్లో 55.9 సగటుతో 9,999 పరుగుల వద్ద కొనసాగుతున్నాడు. ఇందులో 34 సెంచరీలు, 41 అర్ధసెంచరీలు ఉన్నాయి.

కివీస్‌దే తొలి వన్డే

లంకపై ఘన విజయం

వెల్లింగ్టన్: శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన తొలి వన్డేలో కివీస్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లంక నిర్దేశించిన 179 పరుగుల లక్ష్యాన్ని కివీస్ 26.2 ఓవర్లలో వికెట్ నష్టపోయి విజయాన్నందుకుంది. దీంతో సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. ఓపెనర్ విల్‌యంగ్(90 నాటౌట్) అర్ధసెంచరీతో రాణించాడు. లంక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ కివీస్ విజయంలో కీలకమయ్యాడు. విక్రమసింఘేకు ఏకైక వికెట్ దక్కింది. తొలుత మ్యాట్ హెన్రీ(4/19) ధాటికి లంక 43.4 ఓవర్లలో 178 పరుగులకు కుప్పకూలింది. జట్టులో అవిష్క ఫెర్నాండో(56), జనిత్(36), హసరంగ(35) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. నాలుగు వికెట్లతో విజృంభించిన హెన్రీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది.

స్టార్ కల్చర్ పోవాల్సిందే..

● కోహ్లీపై విరుచుకుపడ్డ ఇర్ఫాన్ పఠాన్

భారత క్రికెట్ జట్టులో స్టార్ కల్చర్ పోవాల్సిందేనని మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ స్పష్టం చేశాడు. ఆసీస్ చేతిలో భారత్ సిరీస్ ఓటమి తర్వాత పఠాన్ మాట్లాడుతూ 'జట్టు స్టార్ల సంస్కృతికి ఇప్పటికైనా స్వస్తి పలుకాల్సిందే. స్టార్ కల్చర్ పోయి టీమ్ కల్చర్ రావాల్సిందే. ఇందుకు ఎవరూ అతీతులు కారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై ఇప్పటికైనా టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయానికి రావాలి. కోహ్లీ స్థానంలో యువ క్రికెటర్‌కు అవకాశమిస్తే కచ్చితంగా 30 సగటుతో పరుగులు సాధించేవాడు. గత కొన్నేండ్లుగా కోహ్లీ ఫామ్‌లేమితో సతమతమవుతున్నాడు. కొవిడ్ తర్వాత అతని ఆటతీరు మరింత దారుణంగా మారింది. 2020 నుంచి 39 మ్యాచ్‌లు ఆడితే 30.72 సగటుతో 2,028 పరుగులు చేశాడు. కోహ్లీ.. దేశవాళీ క్రికెట్ ఆడి పదేండ్లు దాటే ఉంటుంది. ఫామ్ అందిపుచ్చుకునేందుకు సచిన్ టెండ్కూలర్ లాంటి దిగ్గజం కూడా దేశవాళీ మ్యాచ్‌లు ఆడాడు' అని అన్నాడు.

నేను భారతీయున్ని కాబట్టే

ట్రోఫీ ఇచ్చేందుకు పిలువలేదన్న గవాస్కర్

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ప్రదాన కార్యక్రమంలో ఒకింత వివాదం చోటు చేసుకుంది. మ్యాచ్ ముగిసిన తర్వాత ట్రోఫీ ఇచ్చేందుకు బోర్డర్‌ను ఆహ్వానించిన నిర్వాహకులు అదే సమయంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్‌ను విస్మరించారు. అక్కడే మ్యాచ్‌పై విశ్లేషిస్తున్న తనను ఆహ్వానించకపోవడంపై గవాస్కర్ తనదైన రీతిలో స్పందించాడు. 'ట్రోఫీ ప్రదాన కార్యక్రమానికి నేను కూడా రావాలనుకున్నా. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ అంటేనే భారత్-ఆస్ట్రేలియా సమరం. ఆ సమయంలో నేను ఇక్కడే ఉన్నాను. నేను భారతీయున్ని కాబట్టే నన్ను పిలువలేదనుకుంటా' అని అన్నాడు.

పరాజయం పరిపూర్ణం

10 ఏండ్ల తర్వాత బోర్డర్-గవాస్కర్ సిరీస్ భారత్ చేజారె ● డబ్ల్యూటీసీ బెర్తు గల్లంతు

సిడ్నీ టెస్టులో ఆస్ట్రేలియా ఘన విజయం ● సిరీస్ 3-1తో కైవసం

టెస్టు క్రికెట్ పట్ల అంకితభావమున్న ప్రతీ ఒక్కరు దేశవాళీలో ఆడాల్సిందే. జట్టుకు ఆడాలనుకున్న అందరికీ ఇది వర్తిస్తుంది. ఐదు నెలల తర్వాత ఏం జరుగుతుందో ఇప్పుడే నేను ఏం చెప్పలేను. జట్టు గెలువాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోకతప్పదు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు ఏం జరుగుతుందో వేచిచూద్దాం. ఇప్పటి వరకు జరిగింది భారత క్రికెట్ బాగుకోసమే. ప్రతీ ఒక్కరు దేశవాళీల్లో ఆడాలి. ఒక మ్యాచ్‌కే పరిమితం కాకుండా అన్నీ మ్యాచ్‌లు ఆడాలి. దేశవాళీకి ప్రాధాన్యమివ్వకపోతే టెస్టు క్రికెట్‌లో సరైన ప్లేయర్లకు చాన్స్ దొరకదు. ఏ ఒక్క ప్లేయర్ భవిష్యత్ గురించి నేను మాట్లాడను. -చీఫ్ కోచ్ గంభీర్

సుదీర్ఘ భారత క్రికెట్ చరిత్రలో అభిమానులకు మరో చేదు గుళిక. ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌ను భారత్ చేజార్చుకుంది. అప్రతిహత విజయాలతో దశాబ్ద కాలంగా తమ వద్దే అట్టిపెట్టుకున్న ట్రోఫీని ఆస్ట్రేలియాకు అప్పగించింది. ఆస్ట్రేలియాను ముచ్చటగా మూడోసారి వారి సొంతగడ్డపై మట్టికరిపించి హ్యాట్రిక్ కొడుదామనుకున్న టీమ్‌ఇండియా ఆశలు అడిఆశలయ్యాయి. బ్యాటింగ్ వైఫల్యంతో 1-3తో సిరీస్ కోల్పోయిన భారత్ సిడ్నీ టెస్టులో ఘోర పరాజయాన్ని చవిచూసింది. బోలాండ్ ఆరు వికెట్ల ప్రదర్శనతో స్వల్ప స్కోరుకే పరిమితమైన టీమ్‌ఇండియా.. ఆసీస్‌ను కట్టడి చేయలేక ఓటమి మూటగట్టుకుంది. దీంతో డబ్ల్యూటీసీ బెర్తు కూడా గల్లంతై ఉత్తచేతులతో స్వదేశానికి పయనమైంది.

సిడ్నీ: బోర్డర్-గవాస్కర్(బీజీటీ) సిరీస్‌లో భారత్ పరాజయం పరిపూర్ణమైంది. పెర్త్ టెస్టులో విజయం మినహాయించి ఆస్ట్రేలియాకు దీటైన పోటీనివ్వలేకపోయిన భారత్ ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 1-3తో చేజార్చుకుంది. 1-0 ఆధిక్యంతో సిరీస్‌ను మొదలుపెట్టిన భారత్ అదే ఒరవడి కొనసాగించలేకపోయింది. దీంతో 2014-15 తర్వాత టీమ్‌ఇండియా బీజీటీ సిరీస్‌ను తొలిసారి ఆసీస్‌కు చేజార్చుకుంది. ముచ్చటగా మూడు రోజుల్లో ముగిసిన సిడ్నీ టెస్టులో భారత్ 6 వికెట్ల తేడాతో ఆసీస్ చేతిలో ఓటమిపాలైంది. టీమ్‌ఇండియా నిర్దేశించిన 162 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 27 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఉస్మాన్ ఖవాజ(41), వెబ్‌స్టర్(39 నాటౌట్), హెడ్(34 నాటౌట్) రాణించారు. ప్రసిద్ధ్ కృష్ణ(3/65) ఆకట్టుకున్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 141/6తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన భారత్ 157 పరుగులకు ఆలౌటైంది. స్కాట్ బోలాండ్(6/45) ఆరు వికెట్లతో టీమ్‌ఇండియా పతనాన్ని శాసించాడు. పంత్(61) టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతావారు విఫలమయ్యారు. బోలాండ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 32 వికెట్లు తీసి భారత్‌ను ఒంటిచేత్తో నడిపించిన బుమ్రాకు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కింది.

బోలాండ్ సిక్సర్

ఓవర్‌నైట్ స్కోరుతో ఆదివారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన భారత్‌ను బోలాండ్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. సిడ్నీ పిచ్‌పై సూపర్ స్వింగ్‌తో చెలరేగిన బోలాండ్..టీమ్‌ఇండియా ఆఖరి వరుస బ్యాటర్లను గడగడలాడించాడు. అప్పటికే నాలుగు వికెట్లతో జోరుమీద కనపించిన బోలాండ్ మిగతా పనిని పూర్తి చేశాడు. ఓవర్‌నైట్ బ్యాటర్లు జడేజా (13), సుందర్ (12) నిలదొక్కుకోలేకపోగా, సిరాజ్ (4), బుమ్రా(0), ప్రసిద్ధ్ కృష్ణ(1 నాటౌట్) ఇలా వచ్చి అలా వెళ్లారు. పిచ్ పరిస్థితులకు తగ్గట్లు బోలాండ్ స్వింగ్‌తో చెలరేగడంతో భారత బ్యాటర్లు పెవిలియన్ బాటపట్టారు. సిరీస్‌లో ఏకంగా ఎనిమిదోసారి కోహ్లీ ఔట్‌సైడ్ ఆఫ్ స్టంప్ బంతులు ఆడి ఔట్ కాగా, బ్యాటర్లు నిలకడ ప్రదర్శించలేకపోయారు. బోలాండ్‌కు తోడు కమిన్స్(3/44) రాణించడంతో భారత్‌కు ఇబ్బందులు తప్పలేదు.

ఆడుతూ పాడుతూ:

నిర్దేశిత లక్ష్యాన్ని ఆసీస్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. సూర్యుడు నిప్పులు కురిపిస్తున్న వేళ ఆసీస్ బ్యాటర్లు ఆది నుంచే భారత బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించారు. తాత్కాలిక కెప్టెన్, సూపర్ ఫామ్‌మీదున్న బుమ్రా గాయం కారణంగా బౌలింగ్‌కు రాకపోవడం ఆసీస్ గెలుపు అవకాశాలను పెంచింది. బుమ్రా గైర్హాజరీలో సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తమదైన రీతిలో ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కాన్‌స్టాస్(22), లబుషేన్(6), స్మిత్(4)ను ప్రసిద్ధ్ పెవిలియన్ పంపాడు. అయితే సిరీస్‌లో తొలిసారి ఖవాజ ఫామ్ ప్రదర్శించాడు. భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ మూడు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. ఆఖర్లో హెడ్, వెబ్‌స్టర్ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు. పసలేని భారత బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ పరుగులు సాధించడంతో లక్ష్యం అంతకంతకు కరుగుతూ పోయింది. స్టాండింగ్ కెప్టెన్ కోహ్లీ..ఉన్న వనరులను మార్చిమార్చి ప్రయోగించినా ఆసీస్‌ను నిలువరించలేకపోయారు.

1 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కోల్పోవడం గత 10 ఏండ్లలో భారత్‌కు ఇది తొలిసారి.

2 గంభీర్ కోచింగ్‌లో భారత్ వరుసగా రెండు టెస్టు సిరీస్‌లు కోల్పోయింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 185 ఆలౌట్, ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 181 ఆలౌట్, **భారత్ రెండో ఇన్నింగ్:** 157 ఆలౌట్ (పంత్ 61, జైస్వాల్ 22, బోలాండ్ 6/45, కమిన్స్ 3/44), ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 27 ఓవర్లలో 162/4(ఖవాజ 41, వెబ్‌స్టర్ 39 నాటౌట్, ప్రసిద్ధ్ కృష్ణ 3/65)

చెడ్డవాళ్లకు డాకు.. మంచివాళ్లకు మహారాజు

అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్‌కేసరి సినిమాలతో హ్యాట్రిక్ విజయాలను అందుకున్న నందమూరి బాలకృష్ణ.. అదే దూకుడు కొనసాగిస్తూ చేసిన ప్రెస్టేజియస్ యాక్షన్ డ్రామా 'డాకు మహారాజ్'. కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ట్రైలర్‌ను అమెరికా డల్లాస్‌లో విడుదల చేశారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 8.39 నిమిషాలకు ట్రైలర్ విడుదలైంది. 2 నిమిషాల 44 సెకన్లున్న ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేసిందని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. 'అనగనగా ఒక రాజు ఉండేవాడు.. చెడ్డవాళ్లంతా ఆయనను డాకు అనేవాళ్లు. మాకు మాత్రం మహారాజ్..' అనే చిన్న పాప వాయిస్‌తో ట్రైలర్ మొదలైంది. తొలుత 'డాకు మహారాజ్'గా, తర్వాత చిన్నారిని రక్షించే నానాజీగా రెండు కోణాల్లో మాస్ మెచ్చేలా బాలయ్య ఈ ట్రైలర్‌లో కనిపిస్తున్నారు. హాస్యం, ఉద్వేగం, యాక్షన్ మేళవింపుగా ట్రైలర్ సాగింది. బాబీ డియోల్ విలన్‌గా, శ్రద్ధా శ్రీనాథ్, ఊర్వశి రౌతేలా, మకరంద్ పాండే కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. హాలీవుడ్‌ని తలపించేలా విజువల్స్ ఉంటాయని, తమన్ మ్యూజిక్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ కార్తీక్, సమర్పణ: శ్రీకర స్టూడియోస్, నిర్మాణం: సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్.

నీతికీ అవినీతికీ జరిగే యుద్ధమిది

'ప్లేయర్‌గా ఆడుతున్నప్పుడు ఆట మీదే దృష్టి పెట్టాలి. పక్క చూపులు చూడకూడదు. నటుడిగా ఉన్నప్పుడు పాత్రపైనే దృష్టి పెట్టాలి. ఇతర వ్యవహారాల్లో వేలు పెట్టకూడదు.' అని నట దర్శకుడు ఎస్.జె.సూర్య అంటున్నారు. 'గేమ్‌ఛేంజర్'లో నటించేటప్పుడు మీలో ఉన్న దర్శకుడు ఎప్పుడైనా బయటకు వచ్చారా? అనే ప్రశ్నకు పై విధంగా ఆయన సమాధానమిచ్చారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా, శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన 'గేమ్ ఛేంజర్' సినిమాలో ఆయన కీలక పాత్రధారి. ఈ సినిమా ఈ నెల 10న ప్రపంచవ్యాప్తంగా పానిండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం ఎస్.జె.సూర్య విలేకరులతో మాట్లాడారు. 'శంకర్‌గారికి సలహాలిచ్చే స్థాయి నాకు లేదు. ఆయన విజనరీ. రాజమౌళి లాంటి వాళ్లే ఆయన్ను ఆదర్శంగా భావిస్తారు. అందుకే ఆయన చెప్పింది చెప్పినట్టు చేసుకుంటూ వెళ్లాను. నా నటన చూసి ఇంప్రస్ అయ్యి, 'ఇండియన్ 2'లో నాకు అవకాశం ఇచ్చారు. శంకర్‌సార్ డైరెక్షన్‌లో చేయడం ఓ గొప్ప వరం.' అని ఎస్.జె.సూర్య చెప్పారు. రామ్‌చరణ్‌లోని గొప్ప నటుడ్ని ఈ సినిమాలో చూస్తారని, ఐఏఎస్ రామ్‌నందన్‌గా, అప్పన్నగా రెండు విభిన్న పాత్రల్లో ఆయన కనిపిస్తారని, ముఖ్యంగా అప్పన్న లైఫ్ టైమ్ గుర్తిండిపోయే పాత్ర అని సూర్య తెలిపారు. 'ఓ అవినీతి పరుడైన రాజకీయ నాయకుడికీ, ఓ నిజాయితీ పరుడైన ఐఏఎస్‌కీ జరిగే యుద్ధమే 'గేమ్ ఛేంజర్'. ఈ యుద్ధాన్ని శంకర్ ఎంత బాగా తీశారో థియేటర్లలో చూస్తారు. చాలా ప్రిపేర్ అయ్యి ఈ పాత్ర చేశాను. డబ్బింగ్ చెప్పేటప్పుడు కూడా చాలా కష్టం అనిపించింది. తెలుగు, తమిళ, హిందీ అన్ని భాషల్లో నేనే డబ్బింగ్ చెప్పా. నేను ఎంజాయ్ చేస్తూ చేసిన పాత్ర ఇది.' అని ఎస్.జె.సూర్య చెప్పారు.

చిత్రం

అలాంటి ట్యాగ్స్ నేనివ్వను

'సినిమా ఒప్పుకున్న తర్వాత దర్శకుడిపై నమ్మకం పెట్టి ముందుకెళ్లాలి. అప్పుడే కథలోని పాత్రకు కనెక్ట్ కాగలం' అంటున్నది అందాలభామ త్రిప్తి డిమ్రీ. ఇటీవల తనిచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. ' 'యానిమల్' ఆఫర్ రాగానే దర్శకుడు సందీప్‌ని కలిశా. ఆయన నాకు కథ చెప్పలేదు. జోయా పాత్ర గురించే చెప్పారు. ఆ సినిమాకు ముందు నేను చేసినవన్నీ సున్నితమైన, పాజిటివ్ రోల్సే. 'యానిమల్'లో జోయా పాత్ర వాటికి పూర్తి భిన్నమైనది. తన మనసులో మోసం చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ, ఫేస్‌లో దయ, సానుభూతి కనిపించాలని సందీప్ చెప్పారు. అది నాకు సవాలుగా అనిపించింది. వెంటనే ఓకే చేశాను. సందీప్‌ని నమ్మి ముందుకెళ్లాను. ఫలితం మీఅందరికీ తెలుసు. చాలామంది 'యానిమల్'కి స్త్రీ ద్వేష చిత్రంగా ట్యాగ్ ఇస్తున్నారు. నేనైతే ఒప్పుకోను. 'యానిమల్' అనేది ఓ క్యారెక్టరైజేషన్. దానిచుట్టూ కథ నడుస్తుంది. ఆ పాత్ర అలాంటి కథనే కోరుకుంటుంది. ప్రేక్షకులు కూడా ఆ క్యారెక్టర్‌కి కనెక్ట్ అయ్యారు కాబట్టే అంత హిట్ అయ్యింది' అని చెప్పుకొచ్చింది త్రిప్తి డిమ్రి.

రాజుగారి దొంగలు

లోహిత్ కల్యాణ్, రాజేష్ కుంచాడా, జోషిత్ రాజ్‌కుమార్, కైలాష్ వేలాయుధన్, పూజా విశ్వేశ్వర్, టీవీ రామన్, ఆర్కే నాయుడు ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'రాజుగారి దొంగలు'. లోకేష్ రనల్ హిటాసో దర్శకుడు. నడిమింటి బంగారునాయుడు నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్ లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. నిర్మాతలు వి.దామోదర ప్రసాద్, బెక్కెం వేణుగోపాల్, నటుడు జెమినీ సురేష్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. ఈ సినిమాలో అవకాశం ఇచ్చినందుకు దర్శక,నిర్మాతలకు ప్రధాన పాత్రధారులంతా కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాత అద్భుతంగా సహకరించారని, అందరికీ నచ్చేలా సినిమా వచ్చిందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సందీప్ బదుల, ప్రకాశ్‌రెడ్డి, సంగీతం: నాఫల్ రాజా ఏఐఎస్, నిర్మాణం: హిటాసో ఫిల్మ్ కంపెనీ.

అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసులు

సినీ నటుడు అల్లు అర్జున్‌కు పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసులో అల్లు అర్జున్‌కి షరతులతో కూడిన బెయిల్‌ని న్యాయస్థానం మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు అల్లు అర్జున్ మూడుసార్లు చిక్కడ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వెళ్లారు. ఆదివారం 15 నిమిషాల పాటు పోలీస్‌స్టేషన్ వద్దనే ఉన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు.

ఇదిలావుంటే.. సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు ఆదివారం ఉదయం 10.30 గంటలకు అల్లు అర్జున్ వస్తున్నట్లు రాంగోపాల్‌పేట్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో రాంగోపాల్‌పేట్ పోలీసులు అల్లు అర్జున్‌కు నోటీసులు జారీ చేశారు. తమ రాక వల్ల ఆసుపత్రి పరిసరాల్లో పబ్లిక్ ఎక్కువగా చేరే అవకాశం ఉందని, మీడియా గ్యాదరింగ్ వల్ల ఆసుపత్రి వద్ద ఉన్న ప్రశాంత వాతావరణం పాడవుతుందని పోలీసులు తెలిపారు. మీరు రావాలనుకుంటే రహస్యంగా రావాలని, వచ్చే విషయం ముందుగా సమాచారం ఇస్తే దవాఖానా యజమాన్యం, పోలీసులతో కలిసి ఎవరికి ఇబ్బంది లేకుండా ఎంట్రీ, ఎగ్జిట్‌ను ఏర్పాటు చేసేందుకు అవకాశముంటుందని పోలీసులు సూచించారు. అలా కాకుండా ముందస్తు సమాచారం లేకుండా, మాతో సమన్వయం లేకుండా వస్తే.. అక్కడ ఎదైనా జరిగితే.. దానికి పూర్తి బాధ్యత మీరే వహించాల్సి వస్తుందంటూ రాంగోపాల్‌పేట్ పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసును అల్లు అర్జున్ ఇంటికి వెళ్లి అక్కడున్న ఆయన సిబ్బందికి పోలీసులు అందజేశారు.

స్వప్నాల వాన

దర్శకుడు వి.ఎన్.ఆదిత్య చిత్రీకరించిన మ్యూజికల్ వీడియో 'స్వప్నాల వాన'. శ్రీ క్రియేటివ్ మ్యూజిక్ అండ్ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై అమెరికా డల్లాస్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గోపీ కృష్ణ కొటారు ఈ మ్యూజిక్ వీడియోను నిర్మించారు. ఆయన కుమార్తె శ్రీజ కొటారు స్వయంగా పాడి, నటించిన ఈ మ్యూజిక్ వీడియోను దివంగత గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రికి అంకితమిచ్చారు. యశ్వంత్ ఈ వీడియోలోని పాటను రాయగా, పార్థసారథి నేమాని స్వరపరిచారు. ఈ వీడియో లాంచ్ కార్యక్రమం ఇటీవలే జరిగింది. పూర్తిగా అమెరికాలోని డల్లాస్ నగరంలోనే చిత్రీకరణ జరిగిందని, పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలో విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. సిరివెన్నెల స్ఫూర్తితో పిల్లల కోసం ఈ పాటని రూపొందించామని పార్థసారథి నేమాని తెలిపారు. శ్రీజ ప్రొఫెషనల్ సింగర్‌లా పాడిందని, సందేశాత్మకంగా సాగే ఈ పాట అందరికీ నచ్చుతుందని, వీలైనంత త్వరలో విడుదల చేస్తామని వీఎన్ ఆదిత్య తెలిపారు.

ఆ అభిమానంతోనే..

'గేమ్‌ఛేంజర్'లో 'జరగండి జరగండి జరగండీ..' పాట ఎంత హిట్ అయ్యిందో తెలిసిందే. ఈ పాటకు ప్రభుదేవా నృత్యరీతుల్ని సమకూర్చారు. ఈ ఒక్కపాటకు ఆయన రెమ్యునరేషన్ ఎంత తీసుకున్నారో తెలుసా?! ఒక్క పైసా కూడా తీసుకోలేదట. ఈ విషయాన్ని స్వయంగా దర్శకుడు శంకర్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ప్రభుదేవా.. చిరంజీవి వీరాభిమాని. మెగాస్టార్ నటించిన ఎన్నో పాటలకు ఆయన కొరియోగ్రఫీ అందించారు. దర్శకుడిగా కూడా పనిచేశారు. ఆ ప్రేమతోనే 'గేమ్ ఛేంజర్'లోని పాటకు నృత్యరీతుల్ని సమకూర్చారట. మరో విషయం ఏంటంటే.. ప్రభుదేవాను 'ప్రేమికుడు' సినిమాతో హీరోని చేసింది శంకర్. అది కూడా ఓ కారణం కావొచ్చు.

పీరియాడిక్ యాక్షన్ 'కోరా'

కన్నడ నటుడు సునామీ కిట్టి హీరోగా నటిస్తున్న చిత్రం 'కోర'. ఒరాటశ్రీ దర్శకుడు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఛరిష్మా కథానాయిక. ఈ సినిమా టీజర్‌ను అగ్ర నటుడు విజయ్ సేతుపతి సోషల్‌మీడియా వేదికగా విడుదల చేశారు. హై ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌తో టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. లవ్, యాక్షన్ జోనర్‌లో వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, పాన్ ఇండియా సినిమాగా అందరినీ మెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: బీఆర్ హేమంత్ కుమార్, నిర్మాతలు: డా॥ ఏబీ నందిని, ఏఎన్ బాలాజీ, పి.మూర్తి, రచన-దర్శకత్వం: ఒరాటశ్రీ.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist